# రామాయణంలో హనుమంతుడు



## ఉషశ్రీ



**ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో, ఎంత మాట్లాడాలో తెలిసిన వాడు హనుమంతుడు.**

రామాయణంలో హనుమంతుని వెంట అనుదినం ఒకగంట తిరుగుతూంటే మన ధీశక్తి వికసించి దానిని ఎదుటివారికి తెలిపే సంభాషణ చాతుర్యం లభిస్తుంది. కిష్కింధలో హనుమత్ప్రవేశం నుండి యుద్ధకాండ చివర రామపట్టాభిషేక పర్యంతం ఈ ధీమంతుని వెంట సావధాన చిత్తులై నడవండి. కొంతలో కొంతయినా మాట్లాడేశక్తి అలవడుతుంది.



### 8

**<u>ఆత్మ విమర్శ</u>**

ప్రతిపక్షులతో, మిత్రులతో మాట్లాడిన సందర్భాలే కాక ఆత్మ విమర్శన విషయంలో కూడా హనుమంతుడు మనకు ఆచార్యత్వం వహిస్తాడు.

లంకా దహనం చేసేశాక విచారంలో పడ్డాడు. ‘ఆగ్రహావేశంలో ఎంత పొరపాటు చేశాను. ఈ దహన కాండలో అశోకవనం కూడా అగ్నికి ఆహుతయి సీతాదెవికి అపాయం సంభవించి ఉంటే భవిష్యత్తు ఏమిటి?

రావణుని మీద క్రోధంతో ఈ దారుణానికి తలపడ్డాను. సర్వనాశనం చేసుకున్నాను.

క్రుద్ధః పాపం నకుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురూనపి
క్రుద్ధః పరుషయా వాచా నరంః సాధూనధి క్షిపేత్.

క్రోధానికి లొంగినవాడు చెయ్యలేని చెడ్డపని లేదు. దానికిలోబడ్డామో,

సాధువులను హింసించగలం
గురువులను హననం చేయగలం
పరుష వాక్కులతో కర్కశంగా చరించగలం.

అందుచేతనే కామక్రోధాలకు లొంగని మహనీయులు ధన్యులు’ అనుకుంటాడు.

హనుమంతుని వంటి ధీశాలి, పరాక్రమవంతుడు సైతం కోపానికి లొంగితే ఎంతటి అనర్థం జరుగుతుందో చెపుతూనే సామాన్యులు క్రోధానికి ఎంత దూరంలో ఉండాలో బోధిస్తుంది ఈ సన్నివేశం.

ఆగ్రహం, ఆవేశం వహించినప్పుడు తొందరపడి ఎలా చరిస్తామో, దానివల్ల కలిగే అనర్థాలేమిటో, అలానే సంతోషంలో కూడా పూర్వాపర వివేకాలు కోల్పోయి ప్రవర్తించే విధానం కూడా చూస్తాం. అయినా ఆరంభించిన కార్యానికి విఘాతం కలుగకుండా చూసుకోవడం హనుమంతుని వంటి వానికే సాధ్యం. అటువంటి సాధకుని గురువుగా గ్రహించి ఆయన చర్యలను, వాక్కులను అవగాహన చేసుకుని ఆచరించగలిగితే మనం కూడా కొంతలో కొంత ఉత్తమ గుణ సంపన్నులమై ఆత్మ శ్రేయస్సును, లోక కళ్యాణాన్ని సాధించగలుగుతాం.

●●●

'సీతాదేవికి అపాయం సంభవించి ఉంటే..? ' అని విచారిస్తున్న హనుమంతునికి అంతలోనే మరో ఆలోచన కలిగింది.

'నేను పొరబడుతున్నాను. మంగళ రూపిణి అయిన సీతాదేవిని అగ్ని ఆమె తేజస్స్వరూపిణి, అగ్నిని అగ్ని ఏం చెయ్యగలదు.

సీతారాముల ప్రభావంచేత కాకపోతే ఇంతగా జ్వలించిన అగ్ని నా తోకను వేడెక్కించలేదే' అనుకున్నాడు.

ఒక్కమారు అమ్మవారిని చూసి వెళ్ళాలని నిశ్చయించుకుని, శింశుపావృక్షం చేరి, ఆ ఛాయలో పసివాడకుండా ఉన్న సీతాదేవిని దర్శించి తిరుగుప్రయాణానికి సన్నద్ధుడయాడు.

***శబ్ద బ్రహ్మవేత్త***

బయలుదేరి రామబాణంలా సాగుతూ సముద్రతీరానికి కొంతదూర్మలో ఉండగా సింహ గర్జన చేశాడు.

ఆ ధ్వని వింటూ సముద్రతీరానికి ఈవలి ఒడ్డున ఉన్న వానర వీరులందరూ ఆశ్చర్యమో జాంబవంతుని చుట్టూ చేరారు.

వారందరినీ దగ్గరగా పిలిచి –

'నాయనా! మీరు నిర్భయంగా ఉండండి. మన మారుతి కార్యసాధకుడై తిరిగి వస్తున్నాడు. అదే ఆ ధ్వని. కార్యసాధకుడు కానివాడు అటువంటి సింహగర్జన చేయలేడు' అని ఓదార్పు పలికాడు.

ఇక్కడ ఒక ప్రధానాంశం ఉన్నది.

హనుమంతుడు తిరిగివస్తూ అంత భయానకమయిన సింహనాదం చేయడం దేనికి అని శంక కలుగుతుంది. సరాసరి వచ్చి విషయం చెప్పవచ్చు కదా.

నిజమే. తిరిగి వచ్చి అందరికీ తన కార్యసాధన వార్త వివరించవచ్చు.

సామాన్యంగా ఎవరయినప్పటికీ చేసేపని అదే

కాని..

నిన్న ఉదయం బయలుదేరిన హనుమంతుడు ఈ రోజు సాయంత్రానికి వస్తున్నాడు. బయలుదేరిన క్షణం నుంచి, నీల, గజ గవయ, గవాక్ష, గంధ, మాదన, మైంద, ద్వివిధ, అంగదాదులందరూ అన్నపానాలు ముట్టకుండా ఆయన రాకకోసం ఎదురుచూస్తున్నారు.

హనుమంతుడు వచ్చి 'సీతను చూశాను.. ' అంటే తప్ప వీరెవ్వరికీ మనశ్శాంతి లేదు.

సీతను చూడకుండా వస్తే సర్వవానర యోధులకూ శిరచ్ఛేదమే శిక్ష – అని సుగ్రీవుని ఆజ్ఞ

హనుమంతుడు సీతాదర్శనం చేసి రాకపోతే వీరెవరి ప్రాణాలు ఉండవు.

అందుకే తాను కార్యం సాధించుకు వచ్చాననే భావం వ్యక్తం చేయడానికి సింహనాదం కారణం అర్థం చేసుకోగలవారుండాలి కదా! అనే సందేహం సామాన్యుడికి కలుగుతుంది.

తెలుసుకోగల జాంబవంతుడున్నాడని హనుమంతుడికి తెలుసు.

దూరం నుండి సింహనాదం చేసిన హనుమంతుడు తన ఆప్తమిత్రుల మధ్యకు దిగుతూ –

"దృష్టా సీతా" అన్నాడు.

చూశాను సీతని అని ఆరంభించాడు.

సీతని చూశాను, అని ఆరంభించవచ్చు. సీతని అని ప్రారంభించగానే, చూశాను అంటాడో, చూడలేదు అంటాడో అనే ఉత్కంఠ భరించలేని కొందరి గుండెలు ఆగిపోవచ్చు.

అక్కడున్న వారికి చూడడం ప్రధానం.

"చూశాను" అనగానే సీతాదేవినే అనే విషయం అక్కడున్న వారందరూ గ్రహించగలిగినదే

ఏ మాటను ఎప్పుడు ఎక్కడ ఎలా ప్రారంభించాలి ప్రసంగంలో అనే శబ్దబ్రహ్మ విద్య సాధించినవాడు హనుమంతుడు, అని శ్రీరామచంద్రుడు అనడానికి కారణం ఇక్కడ కూడా తెలుస్తుంది.

సీతా దృష్టా అన్నప్పటికీ వ్యాకరణం, ఛందస్సు ఏవీ దెబ్బతినవు. కాని 'సీతా' శబ్దం కంటే ముందు దృష్టా అని తన వారందరికీ ఒక లిప్తకాలం ముందుగా సంతోషం కలిగించిన ధీమంతుడు హనుమంతుడు.

జంతువులకి లేనిదీ, మానవుడికి దైవం అనుగ్రహించినదీ వాక్కు. మనలోని ఆలోచనలనీ, భావాలనీ వ్యక్తం చేసుకోగల శక్తి వాక్కులో ఉన్నది. ఈ వాక్ శక్తిని సద్వినియోగ పరుచుకోగలగడంలోనే మనిషి గొప్పతనం ఉన్నది. ఒక మాట మాట్లాడడానికి ముందు, ఆలోచించి ఏ పదాలు అవసరం, ఏ మాటలు ఎదుటి మనిషికి మన మనసులోని భావాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి, ఏ మాటలు అపార్థాలకి దారి తీస్తాయి, ఏ పదాలు వాడడం వలన, భావం వ్యక్తమవడమే కాక, మనోరంజకంగా ఉంటుంది, అనే విషయాలన్నీ ఆలోచించి, మాట్లాడడం ఎలా అనే అంశాన్ని సాధన చేసినట్లయితే తిరుగులేదు, హనుమంతుని వలె.

***ఔచిత్యం***

గగనవీధి నుండి హనుమంతుడు కిందికి దిగిన అనంతరం వానర యోధులందరూ ఆయనను పరమ సంతోషంతో సత్కరించారు. అప్పుడు జాంబవంతుడు

'నాయనా ఎలా వెళ్ళావు? అక్కడి విశేషాలేమిటి? పరమ క్రోధుడైన రావణుని కథ ఏమిటి?' అంటూ ప్రశ్నపరంపర నడిపించాడు.

'తాతా మీరందరూ చూస్తుండగా మహేంద్రగిరి నుండి బయలు దేరాను. దారిలో మైనాకుడు అడ్డువచ్చి అతిథి సత్కారం చేస్తానన్నాడు. ఇప్పుడు కాదని ముందుకు సాగాను. సురస ఎదురుపడి మ్రింగుతానంది. తెలివిగా తప్పించుకున్నాను. లంకా నగరం సమీపిస్తుండగా ఛాయాగ్రాహిణి సింహిక తన శక్తితో నన్ను లాగబోయింది. ఒక్క దూకులో దాని కడుపులో ప్రవేశించి కీళ్ళు సడలించి, పైకి లేచి, లంకా నగరం కోట గోడమీద దిగాను. చీకటి పడుతుండగా లంకలో దిగి అన్ని భవనాలూ తిరిగాను. చివరకు అశోకవనంలో అమ్మవారిని దర్శించాను. ఆనవాలుగా ఆవిడ చూడామణి ఇచ్చింది. అప్పుడు బాగా ఆలోచించి అశోకవనం ధ్వంసం చేశాను.

రావణుడు తన సేనలు పంపాడు వారిని నేలకూల్చాను. వాని పుత్రుడు అక్ష కుమారుని కూడా యమసదనం చేర్చాను. వాడు రాక్షసులను పంపడం, నేను చంపడం అంతే.

చివరకు ఇంద్రజిత్తు వచ్చాడు. వీడు వాడి పెద్దకొడుకు. మహా మాయావి, అస్త్ర శస్త్ర విద్యలలో ఘటికుడు వాడు బ్రహ్మాస్త్రంతో బంధించి రావణుని ముందు నిలబెట్టాడు. ఆ దుర్మార్గుడు నన్ను చంపమని ఆజ్ఞాపించాడు. కాని వాని తమ్ముడున్నాడు, ధర్మాత్ముడు నన్ను చంపమని ఆజ్ఞాపించాడు. కాని వాని తమ్ముడున్నాడు, ధర్మాత్ముడు విభీషుడు. అతడు హితబోధ చేయగా చివరకు నా తోకకు నిప్పు ముట్టించమన్నాడు రావణుడు.'

Comment on this article..

(తరువాయి వచ్చేసంచికలో)

●●●


శ్రీ ఉషశ్రీ పుస్తకాలని
బంధుమిత్రులకి శుభాకాంక్షలతో బహుకరించండి
ధర్మసందేహాలు
వెల రూ. 60/-
50 కాపీలు - రూ. 2400/-
100 కాపీలు - రూ. 4200/-
ధర్మ సందేహాలు
ఉషశ్రీ
శ్రీ వేంకటేశ్వర కల్యాణం
వెల రూ. 100/-
50 కాపీలు - రూ. 3000/-
100 కాపీలు - రూ. 5000/-
శ్రీ వేంకటేశ్వర కల్యాణం
గీతాసారం
వెల రూ. 30/-
50 కాపీలు - రూ. 1250/-
100 కాపీలు - రూ. 2100/-